18 నుంచి 'వింగ్స్ ఇండియా'

- 21 వరకు బేగంపేటలోని విమానాశ్రయంలో ప్రదర్శన
- ఏర్పాట్లు చేయాలని అధికారులకు సీఎస్ ఆదేశం
- ఆలరించనున్న లోహవిహంగాలు

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): బేగంపేట విమానాశ్రయంలో ఈ నెల 18 నుంచి 21 వరకు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'వింగ్స్ ఇండియా-2024' ప్రదర్శనను విజయవంతం చేసేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం ఆమె ఈ కార్యక్రమంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు, ఫిక్కీ ప్రతినిధులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ.. రెండేండ్లకోసారి నిర్వహించే వింగ్స్ ఇండియా ప్రదర్శనలో ఈ ఏడాది కొత్తగా ఏయిర్‌క్రాఫ్ట్‌లతోపాటు పలు విమాన తయారీ సంస్థలు, విమానయాన సేవల సంస్థలు, ఆగ్జిలరీ యూనిట్లు, పర్యాటక విభాగాలు పాల్గొనున్నాయని తెలిపారు. దేశ, విదేశాల నుంచి ఉన్నతస్థాయి ప్రతినిధులు హాజరయ్యే ఈ ఈవెంట్‌కు విస్తృత ఏర్పాట్లు చేయాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. చివరి రెండు రోజుల్లో లక్ష మందికిపైగా సందర్శకులు ఈ ప్రదర్శనకు వచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యామ్నాయ పార్కింగ్ స్థలాలను గుర్తించాలని పోలీస్ శాఖకు స్పష్టం చేశారు. పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జీహెచ్ఎంసీని ఆదేశించారు. ఈనెల 16 నుంచి ప్రదర్శన ముగిసే వరకూ బేగంపేట విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో ఎవరూ పతంగులు ఎగరేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పౌర విమానయాన శాఖ జాయింట్ సెక్రటరీ అసంగ్‌బా చుబా ఆవో, ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, ఫిక్కీ డైరెక్టర్ మనోజ్, విమానయాన విభాగం డైరెక్టర్ భరత్‌రెడ్డి, బేగంపేట ఏయిర్‌పోర్ట్ డైరెక్టర్ పీకే హజారీ తదితరులు పాల్గొన్నారు.

సౌర విద్యుత్తు ఉత్పత్తి పెరగాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సౌర విద్యుత్తు ఉత్పత్తిని పెంచడానికి గృహ వినియోగదారులకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. విద్యుత్తు కొరత రాకుండా సౌర విద్యుత్తును పెద్ద మొత్తంలో వినియోగంలోకి తీసుకురావడానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. మంగళవారం సచివాలయంలో పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీఎస్ రెడ్కో) ఆధ్వర్యంలో అమలుచేస్తున్న పథకాలు, కార్యక్రమాలపై భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ, కమర్షియల్ ఆఫీసు భవనాలపై సౌర విద్యుత్తు వ్యవస్థలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సౌర విద్యుత్తు ఉత్పత్తి వ్యవస్థలను ఏర్పాటు చేసుకునేవారికి రాయితీలు కల్పించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో సౌర విద్యుత్తు ఉత్పత్తిని పెంచేందుకు గృహ వినియోగదారులకు అవగాహన కల్పించి, ప్రోత్సహించాలని వెల్లడించారు.

ఫార్ములా-ఈ రేస్ రూల్స్‌కు విరుద్ధం

- దాంతో రాష్ట్రానికి ప్రయోజనం లేదు
- రేస్‌నెట్‌జెన్ ఎందుకు తప్పుకున్నదో తెలియదు : భట్టి విక్రమార్క

హైదరాబాద్, జనవరి 9(నమస్తే తెలంగాణ): గతేడాది నిర్వహించిన ఫార్ములా ఈ-రేస్ బిజినెస్ రూల్స్‌కు విరుద్ధంగా జరిగిందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పేర్కొన్నారు. ఫార్ములా-ఈ రేస్‌పై ప్రస్తుత ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోకపోవడంతో ఆ ఈవెంట్ రద్దయిందని, దానివల్ల రాష్ట్రానికి నష్టం జరిగిందన్న ఆరోపణలను తోసిపుచ్చారు. ఈ రేస్‌తో రాష్ట్రానికి కలిగిన ప్రయోజనం ఏమీలేదని చెప్పారు. తొలుత రేస్‌నెట్ జెన్, ఫార్ములా-ఈ, రాష్ట్ర ప్రభుత్వం మధ్య ట్రైపార్టీ ఒప్పందం జరిగిందని తెలిపారు. ఒక ఈవెంట్ నిర్వహణ తర్వాత ఈ ఒప్పందం నుంచి రేస్‌నెట్‌జెన్ తప్పుకున్నదని తెలిపారు. ఆ తర్వాత ఫార్ములా-ఈ, ప్రభుత్వం మధ్య తిరిగి ద్వైపాక్షిక ఒప్పందం జరిగిందని వివరించారు. ఆ కంపెనీ ఎందుకు తప్పుకున్నదో స్పష్టతలేదని పేర్కొన్నారు. టికెట్ల విక్రయం ద్వారా వచ్చిన మొత్తంలో ఫార్ములా-ఈ కంపెనీకి రూ.110 కోట్లు చెల్లించాల్సి ఉన్నదని, ఇందులో రూ.55 కోట్లు చెల్లించిన తర్వాత ఆ కంపెనీ వెళ్లిపోయిందని వెల్లడించారు. ఇప్పుడు మిగిలిన మొత్తాన్ని చెల్లించాలంటూ కంపెనీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిందని తెలిపారు. గతంలో సదరు కంపెనీకి డబ్బులు ఏవిధంగా చెల్లించారనే అంశంపై పూర్తిస్థాయిలో న్యాయ విచారణ జరుపుతామని, ఇందులో సంబంధం ఉన్నవారెవరైనా సరే శిక్ష అనుభవించక తప్పదని హెచ్చరించారు.

ఎకరం రైతులకు రైతుబంధు పూర్తి

ఇప్పటివరకు ఎకరంలోపు భూమిగల రైతులకు రైతుబంధు సాయాన్ని జమ చేసినట్టు మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఆ తర్వాత రెండెకరాలలోపు వారికి అందజేస్తామని చెప్పారు. రైతుబంధు కోసం రోజువారీగా నిధులు విడుదల చేస్తున్నామని, విడతల వారీగా రైతులందరికీ రైతుబంధు అందజేస్తామని స్పష్టంచేశారు.

ప్రయోజనాలను మరిచిన సర్కార్

రేస్ వల్ల రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం లేదన్న భట్టి విక్రమార్క వ్యాఖ్యలపై విమర్శలొస్తున్నాయి. ఫార్ములా- రేస్‌ను పలు దేశాల్లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తారు. అలాంటి ఈవెంట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించడం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో నగరానికి ప్రత్యేక ఖ్యాతి లభించింది. తద్వారా ఇది విదేశీ పెట్టుబడులకు మార్గం సుగమం చేసింది. దీంతోపాటు ఫార్ములా-ఈ రేస్ ద్వారా హైదరాబాద్ నగర ఆర్థిక రంగానికి సుమారు రూ.600 కోట్ల ప్రయోజనం కలిగినట్టు పలు సంస్థలు పేర్కొన్నాయి.

మంగళవారం తెలంగాణ హైకోర్టులో జరిగిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి.. హైకోర్టును రాజేంద్రనగర్ వ్యవసాయ యూనివర్సిటీకి తరలించొద్దని నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

హైకోర్టును తరలించొద్దు

పార్లమెంట్ స్టాండింగ్ కమిటీకి నిరసన సెగ

- హైకోర్టును సందర్శించిన కమిటీ
- తరలింపుపై లాయర్ల ఆందోళన
- ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు
- అర్ధంతరంగా ముగిసిన సమావేశం
- భూమి ఇవ్వొద్దని విద్యార్థుల ర్యాలీ

భూములను హైకోర్టుకు ఇవ్వొద్దని ర్యాలీ తీస్తున్న వ్యవసాయ వర్సిటీ విద్యార్థులు

హైదరాబాద్/వ్యవసాయ యూనివర్సిటీ, జనవరి 9 (నమస్తే తెలంగాణ): హైకోర్టును సందర్శించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ(లా అండ్ జస్టిస్)కి న్యాయవాదుల నుంచి నిరసన సెగ తగిలింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఏర్పాటైన స్టాండింగ్ కమిటీ దేశంలోని హైకోర్టులను సందర్శిస్తున్నది. అందులో భాగంగా మంగళవారం తెలంగాణ హైకోర్టును సందర్శించిన కమిటీకి హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె నాగేశ్వర్‌రావు స్వాగతం పలికారు. హైకోర్టులో మౌలిక వసతులు, ఆన్‌లైన్ కేసుల విచారణ వంటి అంశాలపై ఏర్పాటైన కమిటీ సభ్యులు ప్రసంగిస్తుండగా పలువురు న్యాయవాదులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. హైకోర్టు తరలింపు నిర్ణయాన్ని ఏకపక్షంగా తీసుకున్నారని, వెంటనే దీనిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత హైకోర్టులో అన్ని వసతులు ఉన్నాయని, పార్కింగ్ సమస్యను పరిష్కరిస్తే సరిపోతుందని తెలిపారు. నిరసనలు, నినాదాలతో అర్ధంతరంగా సమావేశాన్ని ముగించిన కమిటీ సభ్యులు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో సమావేశం తర్వాత వచ్చి కలుస్తామని చెప్పి వెళ్లిపోయారు. అధికారంలోకి వస్తే కొత్త భవనాలు నిర్మించబోమని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి హైకోర్టు తరలింపునకు ఆమోదం ఎలా తెలుపుతారని సీనియర్ న్యాయవాది గుండ్రాతి శారదాగౌడ్ ప్రశ్నించారు. న్యాయవాదుల అభిప్రాయాలు తెలుసుకోకుండానే హైకోర్టు తరలింపు నిర్ణయం జరగడం బాధాకరమని పేర్కొన్నారు. సమావేశంలో గందరగోళ పరిస్థితులు నెలకొనడంతో కమిటీ సభ్యుడైన కేఆర్ సురేశ్‌రెడ్డి, కనకమేడల రవీంద్రకుమార్ కల్పించుకుని సీజేతో మాట్లాడతామని నిరసన వ్యక్తం చేసిన న్యాయవాదులకు సర్ది చెప్పి వెళ్లిపోయారు.

100 ఎకరాలా? మా ప్రాణాలా?

హైకోర్టు నిర్మాణం కోసం యూనివర్సిటీ భూములు ఇవ్వొద్దంటూ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీ విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. మంగళవారం తరగతులు బహిష్కరించి ర్యాలీ నిర్వహించారు. యూజీ, పీజీ, పీహెచ్‌డీ చదువుతున్న దాదాపు 200మంది విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. వర్సిటీ పరిధిలో హైకోర్టు నిర్మాణం వల్ల పర్యావరణానికి నష్టం జరగడంతోపాటు వ్యవసాయ పరిశోధనకు ఇబ్బందులు ఏర్పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణప్రాంతం నుంచి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి యూనివర్సిటీ విలువ తెలియకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. జీవో 55ను వెనక్కి తీసుకునే వరకు ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు. విద్యార్థి సంఘాల నాయకులు రాజ్‌కుమార్, శ్రీజ,అరవింద్, మధుకర్, సత్యమూర్తి, సురేందర్ ఆధ్వర్యంలో విద్యార్థులు వర్సిటీ ప్రధాన కార్యాలయం గేటు వద్ద మధ్యాహ్నం వరకు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ 100 ఎకరాలు కావాలా? మా ప్రాణాలు కావాలా? అంటూ నినాదాలు చేశారు.

కమిటీలో ఉన్నది వీరే

సుప్రీంకోర్టు ఆదేశాలతో ఏర్పాటైన ఈ కమిటీకి సుశీల్‌కుమార్ మోదీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. రాజ్యసభ సభ్యులు వందనా చవాన్, కనకమేడల రవీంద్రకుమార్, కేఆర్ సురేశ్‌రెడ్డి, దర్శన్‌సింగ్, వివేక్ కే టంఖా, పీ విల్సన్, లోక్‌సభ్యులు వీణాదేవి, జస్బీర్‌సింగ్ గిల్, రఘురామకృష్ణంరాజు, మలూక్‌నగర్, సురేశ్‌కుమార్, ఓంప్రకాశ్ భూపాల్‌సింగ్, సంధ్యారే, కులదీప్‌రాయ్‌శర్మ, రాజన్, బాబూరావు విచారే సభ్యులుగా ఉన్నారు.

మోదీ పాలనలో రైతులకు చీకటి రోజులు

- రైతు రక్షణ సమితి అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ పాలన రైతులకు చీకటి రోజులనే మిగిల్చిందని తెలంగాణ రైతు రక్షణ సమితి అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. పదేండ్ల హయాంలో రైతుల కోసం మోదీ చేసిందేమీ లేదని, దేశంలో ఏ ఒక్క రైతు సమస్య కూడా పరిష్కారానికి నోచుకోలేదని పేర్కొన్నారు. వీక్షిత్ భారత్ సంకల్ప్ యాత్రలో దేశంలోని ప్రతి రైతు ఖాతాలో కనీసం రూ.30 వేలు వేశానని మోదీ చెబుతున్నారని, అది పచ్చి అబద్ధమని తెలిపారు. ఇప్పుడు ఎన్నికల కోసం రైతులను మభ్యపెట్టాలని ప్రధాని చూస్తున్నారని ధ్వజమెత్తారు. పంటలకు మద్దతు ధర దక్కడం లేదని, పంటల బీమా పథకాన్ని అమలు చేయడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల దేశంలో రైతులు సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నారని పేర్కొన్నారు.

రాష్ట్రంలో మరో 4 డయాగ్నోస్టిక్ హబ్‌లు

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మరో నాలుగు తెలంగాణ డయాగ్నోస్టిక్ (టీడీ) హబ్‌లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే 31 హబ్‌లు ఉన్నాయని, గిరిజన ప్రాంతాల ప్రజలకు సేవలను మరింత చేరువ చేసేందుకు ఈ నాలుగు హబ్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు, ములుగు జిల్లా ఏటూరునాగారం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం, నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూర్‌లో ఈ నాలుగింటిని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అధికారులు బుధవారం నుంచి ఆయా ప్రాంతాల్లో పర్యటించి ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు.

ఎన్నికలలోపే సంక్షేమ పథకాలు

- నిజమైన లబ్ధిదారులకు అందాలి
- త్వరలో ఇందిరమ్మ కమిటీలు
- రాష్ట్రంలో 12 ఎంపీ సీట్లు తగ్గకుండా గెలుచుకోవాలి
- పార్లమెంట్ ఎన్నికలపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల లోపే సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. త్వరలోనే ఇందిరమ్మ కమిటీలను నియమించి, వారి ద్వారా క్షేత్రస్థాయిలో నిజమైన లబ్ధిదారులకే సంక్షేమ పథకాలు అందేలా చూడాలని స్పష్టంచేశారు. తద్వారా పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎక్కువ సీట్లు సాధించడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. మంగళవారం ఆయన పార్లమెంట్ ఎన్నికలపై ఎంసీ హెచ్చార్డీలో సమీక్ష నిర్వహించారు. ఖమ్మం, వరంగల్, కరీంనగర్, నల్లగొండ, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాల పార్లమెంట్ స్థానాల పరిధిలోని ఎమ్మెల్యేలు, ఓడిపోయిన ఎమ్మెల్యే అభ్యర్థులు, ఆయా జిల్లాల ఇన్‌చార్జి మంత్రులతో సీఎం చర్చించారు. కనీసం 12 ఎంపీ స్థానాలకు తగ్గకుండా గెలిపించుకోవడం లక్ష్యంగా పెట్టుకోవాలని దిశానిర్దేశం చేశారు. సోమవారం ఐదు ఉమ్మడి జిల్లాల పరిధిలోని పార్లమెంట్ నియోజకవర్గాలపై సమీక్ష జరిపిన సీఎం, రెండోరోజు మిగతా ఐదు జిల్లాల పరిధిలోని ఎంపీ స్థానాలపై చర్చించారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా పార్టీ విజయవకాశాలపై ఆరా తీశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి అభివృద్ధి పనుల కోసం రూ.10 కోట్లు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద కేటాయిస్తున్నామని చెప్పారు. ఇన్‌చార్జి మంత్రులతో సమన్వయం చేసుకుంటూ పార్టీకి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొనిరావాలని ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలకు సూచించారు.

బదిలీల్లో పైరవీలకు తావు లేదు

అధికారులు, పోలీసుల బదిలీల్లో ఎమ్మెల్యేలు, నాయకులు జోక్యం చేసుకోవద్దని రేవంత్‌రెడ్డి సూచించారు. బదిలీల్లో పైరవీలకు తావు లేదని పేర్కొన్నారు.

వ్యాపార అవకాశాలను ఒడిసిపట్టండి

- రాష్ట్రంలో రియల్, ఫర్నిచర్, కన్జ్యూమర్ గూడ్స్ వ్యాపార అవకాశాలు పుష్కలం
- గోద్రేజ్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- పాఠశాలల్లో మొబైల్ టాయిలెట్లు నిర్మిస్తాం
- మంత్రి కొండా సురేఖతో కోకాకోలా ప్రతినిధులు



మంగళవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన గోద్రేజ్ ఆగ్రోవెట్ కంపెనీ ప్రతినిధులు. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు

సీఎం రేవంత్‌తో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ భేటీ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ మర్యాద పూర్వకంగా కలిసింది. మంగళవారం సీఎం నివాసంలో వివేక్ కే టంకా నేతృత్వంలోని కమిటీ సభ్యులు వందన చవాన్, కనకమేడల రవీంద్ర కుమార్, దర్శనసింగ్, విల్సన్, వీణాదేవి, జస్బీర్‌సింగ్ గిల్, రఘురామ కృష్ణరాజు సహా ఇతర కమిటీ సభ్యులు కలిశారు.

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో రియల్ ఎస్టేట్, ఫర్నిచర్, కన్జ్యూమర్ గూడ్స్ రంగాల్లో ఉన్న అపార అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి గోద్రేజ్ కంపెనీ ప్రతినిధులను కోరారు. ఇప్పటికే కంపెనీ చేపట్టిన ఆయిల్ పామ్, డెయిరీ వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. గోద్రేజ్ ఆగ్రోవెట్ కంపెనీ ప్రతినిధి బృందం మంగళవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా స్కిల్ డెవలప్‌మెంట్‌ను ప్రోత్సహించాలని సూచించారు. గోద్రేజ్ కంపెనీ ఇప్పటికే తెలంగాణలో పలు వ్యాపారాలు నిర్వహిస్తున్నది. వంట నూనెలు, డెయిరీ, ఆగ్రో, వెటర్నరీ సర్వీసెస్, ఆగ్రో కెమికల్స్, పశువుల దాణా తదితర రంగాల్లో వ్యాపారం చేస్తున్నది. మలేషియాకు చెందిన సిమ్ డార్బీ కంపెనీతో కలిసి ఖమ్మం జిల్లాలో ఇంటిగ్రేటెడ్ ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేస్తున్నది. ఈ సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు, సీఎస్ శాంతికుమారి, గోద్రేజ్ ఆగ్రోవెట్ ఎండీ బలరాంసింగ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కోకాకోలా మొబైల్ టాయిలెట్స్

ప్రముఖ శీతల పానీయాల తయారీ సంస్థ హిందుస్థాన్ కోకాకోలా బెవెరేజెస్ (హెచ్‌సీసీబీ) తెలంగాణ పారిశ్రామికాభివృద్ధిలో పాలు పంచుకునేందుకు ముందుకొచ్చింది. మంగళవారం కంపెనీకి చెందిన ప్రతినిధి బృందం సచివాలయంలో మంత్రి కొండా సురేఖతో భేటీ అయింది. ఈ సందర్భంగా నీరు, ఘన వ్యర్థాల నిర్వహణలో సామర్థ్యం పెంపు, వ్యర్థ జలాల పునర్వినియోగం, యువతకు ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని, ఉద్యోగ అవకాశాల్లో మహిళలకు ప్రాధాన్యం కల్పిస్తామని కంపెనీ ప్రతినిధులు మంత్రికి తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మారుమూల గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు, పాఠశాలల్లో మొబైల్ టాయిలెట్లు, అంగన్‌వాడీ భవనాలు నిర్మించనున్నామని చెప్పారు. వ్యర్థాల నిర్వహణపై అవగాహనా సదస్సులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే రాష్ట్రంలో సుమారు రూ.3 వేల కోట్ల పెట్టుబడులు పెట్టామని, సిద్దిపేట జిల్లా బండ తిమ్మాపూర్‌లో గ్రీన్‌ఫీల్డ్ బాట్లింగ్ ప్లాంట్ నిర్మాణంలో ఉన్నదని వెల్లడించారు. రాష్ట్రంలో పెట్టుబడులతోపాటు సామాజిక అభివృద్ధిలో తమ కంపెనీ భాగస్వామ్యమవుతుందని, అందుకు తగిన విధంగా ప్రాజెక్టులను విస్తరిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీసీబీ పబ్లిక్ అఫైర్స్ చీఫ్ హిమాన్షు, క్లస్టర్ హెడ్ ముకుంద్ త్రివేదీ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ వ్యవస్థను పటిష్టం చేస్తాం

- రెవెన్యూ ఉద్యోగుల కృతజ్ఞతసభలో మంత్రి పొంగులేటి

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను పటిష్టం చేస్తామని ఆ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. పూర్వ వీఆర్ఏలకు ఎంప్లాయీ ఐడీలు ఇచ్చి, సమస్యను పరిష్కరించినందుకు ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు చెప్పేందుకు తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సభకు మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించేందుకు రెవెన్యూ ఉద్యోగులు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని ప్రశంసించారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల అమలుకు గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను పునర్నిర్మించాలని కోరారు. రాష్ట్రం నలుమూలల నుంచి 5వేలమందికిపైగా ఉద్యోగులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు చంద్రమోహన్, ట్రెసా పూర్వ అధ్యక్షుడు శివ శంకర్, పూర్వ కార్యదర్శి, కోఆర్డినేటర్ నారాయణరెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు పడిగెల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన కళాకారులకు 6 వేల పెన్షన్

- సీఎంతో చర్చించి నిర్ణయం
- మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): అర్హులైన కళాకారులందరికీ దివ్యాంగులతో సమానంగా రూ.6 వేల చొప్పున పెన్షన్ ఇచ్చే అంశాన్ని సీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హామీ ఇచ్చారు. తెలంగాణ సాధన ఉద్యమంలో కవులు, కళాకారుల పాత్ర మరువలేనిదని గుర్తుచేశారు. రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రవీంద్ర భారతిలో మంత్రులు జూపల్లి, పొన్నం ప్రభాకర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కవులు, కళాకారులు, రచయితలు ముఖ్య భూమిక పోషించారని, యావత్ తెలంగాణ సమాజాన్ని సంఘటితం చేశారని చెప్పారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, యావ కళావాహినికి చెందిన సారిపల్లి కొండల్‌రావు, జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సుంచు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

15న దావోస్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- అనంతరం బ్రిటన్‌కు ప్రయాణం

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 15 నుంచి విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. దావోస్‌లో జరుగనున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో పాల్గొనడంతోపాటు బ్రిటన్‌లో పర్యటించనున్నారు. 15 నుంచి 18 వరకు దావోస్‌లో జరిగే సదస్సులో పాల్గొంటారు. ఆ తర్వాత మరో 3 రోజులు బ్రిటన్‌లో పర్యటించి, పలువురితో సమావేశం కానున్నారు. ఈ పర్యటన కోసం సీఎంతోపాటు 8 మంది సభ్యుల బృందం వెళ్లనున్నది. ఇందులో సీఎం ముఖ్యకార్యదర్శి వీ శేషాద్రి, ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, పెట్టుబడులు, ప్రచారం, విదేశీ వ్యవహారాల ముఖ్యకార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి ఉన్నారు.

ఒకే గొడుగు కిందకు అగ్రి కార్పొరేషన్లు!

- కార్పొరేషన్ల పనితీరును సమీక్షిస్తున్న సర్కారు
- అన్నింటికీ కలిపి ఎండీగా ఐఏఎస్ అధికారి!

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): వ్యవసాయ అనుబంధ కార్పొరేషన్లన్నీ ఒకే గొడుగు కిందకు రాబోతున్నాయా? అన్నింటికి కలిపి ఐఏఎస్ అధికారిని ఎండీగా నియమించబోతున్నారా? అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. కార్పొరేషన్లన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలిసింది. తద్వారా కార్పొరేషన్ల పనితీరు మరింత మెరుగుపరచాలని భావిస్తున్నట్టు సమాచారం. కార్పొరేషన్ల నిర్వహణను కూడా విభజన చేయాలని చూస్తున్నట్టు తెలిసింది. ఒక్కో కార్పొరేషన్‌ను ఒక్కో ఎండీని కాకుండా అన్నింటికి కలిపి ఐఏఎస్ అధికారిని ఎండీగా నియమించాలని భావిస్తున్నట్టు సమాచారం తెలిసింది. వ్యవసాయరంగానికి అనుబంధంగా ఆగ్రోస్, మార్క్‌ఫెడ్, విత్తనాభివృద్ధి సంస్థ, గిడ్డంగుల కార్పొరేషన్, ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్లు ఉన్నాయి. ఇవి పంట ఉత్పత్తుల కొనుగోలు, ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పరికరాల క్రయ విక్రయ వ్యాపారాలు నిర్వహిస్తున్నాయి. వీటితోపాటు మార్కెటింగ్ సంస్థ కార్పొరేషన్ల మాదిరిగానే పలు పనులను చేస్తున్నది. ఇందులో కొన్ని కార్పొర